**విలేకరులు కావలెను**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో తొవ్వ దినపత్రిక లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

జిల్లా బ్యూరో చీఫ్‌లు | జిల్లా స్టాఫ్ రిపోర్టర్‌లు

నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు | మండల రిపోర్టర్‌లు

సంప్రదించవలసిన ఫోన్ నెంబరు :
8328649322, 9398236146.



# తొవ్వ

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 | సంచిక : 280 | సోమవారం 12-05-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 2 | వెల : 5 రూ/.


## రాష్ట్రంలో నేడు, రేపు వర్షాలు

### రేపు దక్షిణ అండమాన్‌కు నైరుతి రుతు పవనాలు

**హైదరాబాద్, మే 11:** రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో సోమ, మంగళవారాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతా వరణ కేంద్రం తెలిపింది. మంగళ వారం కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. ఆదివారం వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో అత్యధికంగా 6, పెద్దపల్లిలో 2.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది. నిజామాబాద్ జిల్లా మెండోరాలో అత్యధికంగా 41.9 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదుకాగా, వికారాబాద్‌లో అత్యల్పంగా 39 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపింది. కాగా, నైరుతి రుతుపవనాలు ఈనెల 13వ తేదీన దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ దీవులు, ఆగ్నేయ బంగాళాఖాతంలో ప్రవేశిస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ఆ తర్వాత 4-5 రోజుల్లో దక్షిణ అరేబియా సముద్రం, కొమరిన్ ప్రాంతం, దక్షిణ, మధ్య బంగాళాఖాతం, అండమాన్‌లో అన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయని తెలిపింది.

## నేడు హాట్‌లైన్‌లో భారత్-పాక్ డీజీఎంవోల చర్చలు

### ప్రస్తావనకు రానున్న కాల్పుల విరమణ కొనసాగింపు, ఇతర కీలకాంశాలు

**న్యూఢిల్లీ, మే 11:** భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ కుదిరిన నేపథ్యంలో ఇరు దేశాల మధ్య సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు కీలక చర్చలు జరగనున్నాయి. హాట్‌లైన్‌లో జరగనున్న ఈ చర్చల్లో రెండు దేశాల డైరెక్టర్ జనరల్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో)లు పాల్గొననున్నారు. కాల్పుల విరమణ కొనసాగింపు, సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితుల వంటి కీలకాంశాలపై చర్చించను న్నారు. అయితే శనివారం మధ్యాహ్నమే ముందుగా భారత్ డీజీఎంవోతో పాక్ డీజీఎంవో హాట్‌లైన్‌లో మాట్లాడారు. కాల్పుల విరమణ అంశాన్ని ప్రతిపాదిస్తూ తక్షణమే అమలు చేయాలని కోరారు. ఈ నేపథ్యంలోనే శనివారం సాయంత్రం 5 గంటల నుంచి కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిందని భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ప్రకటించారు. ఇది జరిగిన కొన్ని గంటల్లోపే డ్రోన్ దాడులు, కాల్పులకు తెగబడి పాక్ సైన్యం విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన సంగతి తెలిసిందే. కాగా, భారత సైన్యానికి సంబంధించిన సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేస్తున్న ఇద్దరు వ్యక్తులను పంజాబ్ పోలీసులు అరెస్టు చేశారు.

# పీవోకేను తిరిగి ఇవ్వాల్సిందే..

### మాకు ఎలాంటి మధ్యవర్తిత్వం అక్కర్లేదు

### అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్‌కు మోదీ స్పష్టం



**న్యూఢిల్లీ, మే 11:** పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)ను భారత్‌కు తిరిగి ఇవ్వాల్సిందేనని.. చర్చలకు ఇదే ప్రధానమని ప్రధాని మోదీ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌కు తేల్చిచెప్పినట్లు తెలిసింది. పాకిస్థాన్ తమకు ఉగ్రవాదులను అప్పగించాల్సిందేనని స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ మేరకు శనివారం ఉదయం జేడీ వాన్స్, మోదీ మధ్య జరిగిన ఫోన్ సంభాషణ వివరాలతో సీఎన్ఎన్, ఇండియాటుడే టీవీ కథనాలను ప్రచురించాయి. "పీవోకేను తిరిగి తీసుకోవడం మా ప్రాథమ్యం. కశ్మీర్‌పై మాకు స్పష్టత ఉంది. ఈ విషయంలో మాకు ఎలాంటి మధ్యవర్తిత్వం అవసరం లేదు" అని వ్యాఖ్యానించినట్లు ఆ కథనాలు తెలిపాయి. అయితే.. మోదీకి జేడీ వాన్స్ ఫోన్ చేయడానికి బలమైన కారణాలున్నట్లు సీఎన్ఎన్ మరో కథనంలో తెలిపింది. "శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు భారత్-పాక్‌ల మధ్య పోరు తీవ్రమైంది" అంటూ అత్యంత కీలకమైన హెచ్చరికలను ఇంటెలిజెన్స్ వర్గాలు వైట్‌హౌసకు అందజేసినట్లు పేర్కొంది. అయితే.. ఇంటెలిజెన్స్ హెచ్చరికల్లోని ముఖ్యాంశాలను మాత్రం ఆ వర్గాలు వెల్లడించలేదని వివరించింది. ఆ వెంటనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉపాధ్యక్షుడు వాన్స్, జాతీయ భద్రత సలహాదారు, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ సూసీ వైల్స్ భారత్-పాక్ ఉద్రిక్తతలను తక్షణం నిలువరించాల్సిన అవసరం ఉందని భావించినట్లు వెల్లడించింది. ఆ మేరకు వైట్‌హౌస్ తీసుకున్న నిర్ణయంతో వాన్స్ వెంటనే(శనివారం ఉదయం) ప్రధాని నరేంద్ర మోదీకి ఫోన్ చేసినట్లు స్పష్టం చేసింది. వాన్స్ పర్యటన సందర్భంలోనే పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే..! వాన్స్‌తో ఫోన్ సంభాషణలో భాగంగా ప్రధాని మోదీ.. పీవోకే, ఉగ్రవాదుల అప్పగింతపై ప్రపంచం.. ప్రత్యేకించి పాకిస్థాన్ అంగీకరించాలని అన్నట్లు సీఎన్ఎన్, ఇండియాటుడే కథనాలు తెలిపాయి. ఒకవేళ పాక్ మళ్లీ కాల్పులు జరిపితే.. భారత్ స్పందన తీవ్రంగా ఉంటుందని తేల్చిచెప్పినట్లు వివరించాయి. భారత్-పాక్ మధ్య చర్చలు ప్రధాని స్థాయిలోనో.. జాతీయ భద్రత సలహాదారుల స్థాయిలోనో జరగవని, మిలటరీ ఆపరేషన్ల డైరెక్టర్ జనరల్స్(డీజీఎంవో) స్థాయిలో చోటుచేసుకుంటాయని వివరించినట్లు తెలిపాయి. భారత్ కాల్పుల విరమణకు అంగీకరించినట్లు ప్రకటన రాగానే.. ఉన్నఫళంగా తీసుకున్న ఈ నిర్ణయంపై మోదీ సర్కారుపై వ్యతిరేకత వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ కథనాలు ప్రచురితమవ్వడం గమనార్హం..!

## స్వదేశీ సాంకేతికత అభివృద్ధే లక్ష్యం

### రాష్ట్రంలో జాతీయ రహదారుల విస్తరణకు కేంద్రం కృషి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్, మే 11:** స్వదేశీ సాంకేతికత ఆధారంగా ఆత్మనిర్భర్ భారత్‌ను నిర్మించేందుకు కొత్త ఆవిష్కరణల దిశగా కృషి చేస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా భారతదేశానికి అసాధారణమైన సాంకేతికతను అందించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పోఖ్రాన్ అణు పరీక్షల వెనక ఉన్న శ్రమను కొనియాడారు. ఇది మన దేశ శాస్త్రీయ సామర్థ్యాన్ని, సంకల్పాన్ని చాటిన అసాధారణ ఘట్టమని కిషన్‌రెడ్డి ప్రశంసించారు. తెలంగాణ అభివృద్ధి కోసం మోదీ ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చించి రహదారుల విస్తరణ చేపట్టిందని తెలిపారు. 2014 నుంచి రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి కోసం రూ. 31,000 కోట్లు కేటాయించిందని చెప్పారు. ఈ నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా 2,722 కి.మీ. జాతీయ రహదారుల నిర్మాణం, మరో 2,526 కి.మీ. రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా ఉన్నతీకరణ చేశామని వెల్లడించారు. భవిష్యత్‌లో భారతమాల పరియోజన మొదటి దశలో రూ.38,297 కోట్ల భారీ బడ్జెట్‌తో రాష్ట్ర వ్యాప్తంగా మరో 1,719 కి.మీ. జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తామని కిషన్‌రెడ్డి ఎక్స్‌లో పోస్టు చేశారు.

# నేడు బుద్ధవనానికి అందాల భామలు

### నాగార్జునసాగర్‌కు మిస్‌వరల్డ్ ప్రతినిధుల రాక..


### ప్రత్యేక బస్సుల్లో తీసుకెళ్లనున్న అధికారులు... 2 వేల మంది పోలీసులతో బందోబస్తు



**హైదరాబాద్/నాగార్జునసాగర్, మే 11:** మిస్ వరల్డ్-2025 పోటీల్లో పాల్గొంటున్న వివిధ దేశాల సుందరీమణులు సోమవారం బుద్ధపూర్ణిమను పురస్కరించుకొని నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని సందర్శించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 110 దేశాలకు చెందిన అందగత్తెలు మిస్‌వరల్డ్ పోటీల్లో పాల్గొంటుండగా.. ఆసియా దేశాల నుంచి వచ్చినవారు మాత్రం బుద్ధవనం సందర్శనకు వెళ్లనున్నారు. బౌద్ధమతంపై విశ్వాసం, బుద్ధుని చరిత్ర తెలుసుకోవాలనే ఆసక్తి గల 30 దేశాలకు చెందిన మిస్‌వరల్డ్ పోటీదారులు బౌద్ధ థీమ్‌పార్క్‌లోని స్తూపంలో బుద్ధుని విగ్రహాల చెంత జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రత్యేకించి ఆయా దేశాల ఆచారాలు, సంప్రదాయాల ప్రకారం ప్రార్థనలు నిర్వహించనున్నారు. సోమవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి భారీ బందోబస్తు మధ్య పర్యాటక అభివృద్ధిసంస్థ ప్రత్యేక బస్సుల్లో వీరిని నాగార్జునసాగర్‌కు తీసుకువెళ్లనున్నారు. మధ్యలో నల్లగొండ జిల్లా చింతపల్లి సమీపంలోని అతిథిగృహం వద్ద కొంతసేపు ఆగుతారు. అక్కడ పర్యాటక సంస్థ విజయ్‌విహార్‌లో కొంతసేపు విశ్రాంతి తీసుకుని ఫొటో సెషన్ తర్వాత అక్కడినుంచి నేరుగా బుద్ధవనం చేరుకుంటారు. లంబాడా కళాకారులు మిస్‌వరల్డ్ ప్రతినిధులకు సంప్రదాయ నృత్యంతో స్వాగతం పలుకుతారు.

**ఆచార్య నాగార్జునుడు నడయాడిన నేల..**

బుద్ధుని ప్రియశిష్యుడు ఆచార్య నాగార్జునుడు నడయాడిన కృష్ణా నదీతీరం నాగార్జునసాగర్ జలాల సమీపంలో 274 ఎకరాల విస్తీర్ణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా బుద్ధవనం, బౌద్ధ థీమ్ పార్క్‌ను అభివృద్ధి చేశాయి. ఇక్కడ బుద్ధుని జీవితం, బోధనలు, బౌద్ధకళ, సంస్కృతిని ప్రదర్శించే పలు నిర్మాణాలు పూర్తి చేశారు. మిస్‌వరల్డ్ పోటీదారులు ఇక్కడ ధ్యానం చేసిన తర్వాత 25 మంది బౌద్ధ సన్యాసులు బైలికుప్ప మహాబోధి పూజలు నిర్వహిస్తారు. పురావస్తు నిపుణుడు శివనాగిరెడ్డి బుద్ధవనం ప్రాజెక్టు ప్రాముఖ్యత, ప్రాశస్త్యంను వివరిస్తారు. అందాల భామల రాక నేపథ్యంలో పర్యాటక శాఖ అధికారులు బుద్ధవనాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. మహాస్థూపం, బుద్ధ పాదాలవద్ద లేజర్ లైట్లు, జతాక వనం లో ఓపెన్ థియేటర్ ఏర్పాటు చేశారు. స్థానిక కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రిలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఐదు పడకలతో ప్రత్యేక వార్డును సిద్ధం చేశారు. కాగా, మిస్ వరల్డ్ పోటీదారుల రాక సందర్భంగా 2వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు.



# మధ్యవర్తిత్వం చేస్తా..

### కశ్మీర్‌పై ట్రంప్ అత్యుత్సాహం

### ఆఫర్‌ను తోసిపుచ్చిన భారత్..

### పీవోకేను అప్పగించడంపైనే మాట్లాడతామని స్పష్టీకరణ

### ట్రంప్ ఆఫర్‌ను స్వాగతించిన పాక్

**న్యూఢిల్లీ, మే11:** ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధాన్ని ఆపలేకపోయారు.. ఇజ్రాయెల్-హమాస్ మధ్య శాంతిని నెలకొల్పడంలోనూ విఫలమయ్యారు.. కానీ భారత్-పాక్ మధ్య పెద్దన్న పాత్ర పోషించి కశ్మీర్ సమస్యను పరిష్కరించడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సిద్ధమైపో యారు. అయితే ట్రంప్ ఆఫర్‌ను భారత్ నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మాత్రం ట్రంప్ మధ్యవర్తిత్వాన్ని స్వాగతించ డంతో పాటు ఈ విషయంలో చొరవ చూపుతున్నందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణలో అమెరికా పాత్ర ఉందని ప్రకటించుకున్న ట్రంప్.. కశ్మీర్ అంశంపైనా అత్యుత్సాహం ప్రదర్శిం చారు. ఈ సమస్య పరిష్కారం కోసం మధ్యవర్తిత్వానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ఈ విషయమె భారత్, పాక్‌తో కలిసి పని చేస్తామని తన ట్రూత్ సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలో శనివారం పోస్టు చేశారు. 'ప్రస్తుత సంఘర్షణలతో మరణాలు, విధ్వంసం తప్ప ఏ ప్రయోజనం ఉండదని భారత్, పాక్‌లోని బలమైన, శక్తిమంతమైన నాయకత్వాలు అర్థం చేసుకున్నందుకు గర్వంగా ఉంది. కాల్పుల విరమణపై నిర్ణయం తీసుకో వడంలో అమెరికా మీకు సాయం చేయగలిగినందుకు గర్విస్తున్నాను. కశ్మీర్ సమస్యకు పరిష్కారాన్ని కనుక్కోవడంలో మీతో కలిసి పనిచేస్తా' అని ఆ పోస్టులో ట్రంప్ పేర్కొన్నారు. కాగా, రెండు దేశాల మధ్య శాంతిని నెలకొల్ప డానికి అమెరికా చేస్తున్న ప్రయత్నా లను పాక్ ప్రధాని ప్రశంసించారు. అయితే కాల్పుల విరమణకు పాక్ డీజీఎంవో ప్రతిపాదన చేశారని, ఇందులో మరొకరి పాత్రలేదని భారత్ పేర్కొంది. కశ్మీర్ విషయంలో ఎవరి మధ్యవర్తిత్వం అవసరంలేదని స్పష్టంచేసింది. 'కశ్మీర్ విషయంలో మాకు స్పష్టమైన వైఖరి ఉంది. పీవోకేను తిరిగి అప్పగించడం ఒక్కటే మిగిలి ఉంది. ఈ విషయంలో ఇంతకుమించి మాట్లాడటానికి ఏంలేదు. ఉగ్రవాదుల అప్పగింతపై వాళ్లు మాట్లాడితే... మేం మాట్లాడతాం. మరో విషయంపై మాట్లాడే ఉద్దేశం లేదు. ఇందులో ఎవరి మధ్యవర్తిత్వం కోరుకోవడంలేదు. ఆ అవసరమూ లేదు'అని ప్రభుత్వవర్గాలు పేర్కొన్నాయి.

## బీజేపీ బీసీలకు వ్యతిరేకం: పొన్నం



**హైదరాబాద్, మే 11:** బీసీలకు బీజేపీ ఎప్పుడూ అన్యాయమే చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఆ పార్టీలో అధికార పదవుల్లో బీసీలకు అవకాశం కల్పించని బీజేపీ.. గతంలో కులగణనకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో అఫిడవిట్ సమర్పించిందన్నారు. బీసీల విషయంలో కాంగ్రెసపై బీజేపీ నేత లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు. బీసీ సంఘాలు, సంస్థలు, మేధావులు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణనను ప్రశంసిస్తుండగా బీజేపీ నాయకులు మాత్రం కాళ్లల్లో కట్టె పెట్టి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

## నేటి నుంచి మరో 25 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో స్లాట్ బుకింగ్

### వచ్చే నెలాఖరుకు రాష్ట్ర వ్యాప్తంగా అమలు

### అధిక రద్దీ కార్యాలయాల్లో అదనపు సిబ్బంది నియామకం

### రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**హైదరాబాద్, మే11:** రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేసేందుకు రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రారంభించిన స్లాట్ బుకింగ్ విధానం సోమవారం(12వ తేదీ) నుంచి మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలులోకి రానుంది. అలాగే, జూన్ నెలాఖరు కల్లా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదివారం ఓ ప్రకటన చేశారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని తొలుత 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రారంభించామని, దశల వారీగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేస్తామని మంత్రి పేర్కొన్నారు. రద్దీ, పని ఒత్తిడి అధికంగా ఉన్న కార్యాలయాల్లో అదనపు సబ్ రిజిస్ట్రార్‌లను నియమిస్తున్నామని చెప్పారు. కుత్బుల్లాపూర్‌లో ఇద్దరు అదనపు సబ్ రిజిస్ట్రార్లను నియమించామని తెలిపారు. ఉప్పల్, మహేశ్వరం, మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు సిబ్బందిని నియమించడం ద్వారా స్లాట్ బుకింగ్ అమలు చేయనున్నామని వివరించారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని దృష్టిలో ఉంచుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిని పునర్వ్యవస్థీకరిస్తున్నామని, అధిక రద్దీ, తక్కువ రద్దీ ఉన్న కార్యాలయాలను గుర్తించి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ క్రమంలోనే రంగారెడ్డి జిల్లా చంపాపేట, సరూర్‌నగర్ పరిధిని విలీనం చేశామని, షాద్‌నగర్, ఫరూక్‌నగర్ కలిపామని, సిద్దిపేట, సిద్దిపేట రూరల్ సబ్ రిజిస్ట్రార్‌లను విలీనం చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు.

## బాధపడొద్దు.. బాధ్యత తీసుకుంటా...

### గల్ఫ్ బాధిత కుటుంబానికి కేటీఆర్ భరోసా



**సిరిసిల్ల/హైదరాబాద్, మే 11:** సౌదీ అరేబియాలో 15 రోజుల క్రితం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామానికి చెందిన మంద మహేశ్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. విష యం తెలుసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండేపల్లిలో ఉన్న మహేశ్ కుటుంబసభ్యులను ఆదివారం పరామర్శించారు. సొంత ఖర్చులతో మహేశ్‌ను భారత్‌కు తీసుకొచ్చి అన్ని విధాలుగానూ ఆదుకుంటానని బాధపడొద్దని భరోసా ఇచ్చారు. మహేశ్‌తో ఫోన్‌లో మాట్లాడి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. కాగా, ఈ విశ్వంలో అత్యంత గొప్ప ప్రేమను పంచేది తల్లి మాత్రమేనని.. ఎంతో గొప్పవారిని మనకు అందించిన మాతృమూర్తులకు వందనం అంటూ కేటీఆర్ ఆదివారం మదర్స్ డే సందర్భంగా ఎక్స్ వేదికగా.. అమ్మలను అభినందించారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**తొవ్వ ,కేసముద్రం, మే 11 :**
కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని అమీనాపురం గ్రామ కృషి విద్యానికేతన్ హై స్కూల్ కి చెందిన 2006 -07 ఎస్ ఎస్ ఎస్సి పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకే చోట కలుసుకున్నారు. చిన్నప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆనందంగా గడిపారు. ఆటపాటలతో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. అప్పటి గురువులు , హెచ్ఎం మోడెం రవీందర్ గౌడ్, చందా గోపి, శ్రీనివాస్, రవికుమార్, భాస్కర్ , తుంపిల్ల రవీందర్, కుమారస్వామి లకు శాలువాలు కప్పి, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వేణుమాధవ్, సతీష్, సల్మాన్ ఖాన్, ప్రవీణ్ , మనోహర్, రజిని, భవాని, కల్పన, సుప్రజ, కిరణ్మయి, సురేందర్, రమేష్, స్వర్ణలత, విజయ్, యాక లక్ష్మి ,రవి, అశోక్, సురేష్, రంజిత్ ,నవీన్, సురేష్, స్వప్న ,రత్నకుమారి, సుష్మ ,రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు

# కాంగ్రెస్ పార్టీకి ఉపాధి అడ్డాలు

**మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు, ఏఎంసి చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్**



**తొవ్వప్రతినిధి, ఖానాపురం, మే11:**
ఖానాపూర్ మండలంలో వరి ధాన్యం కొనుగోలు సెంటర్ పేరుతో కాంగ్రెస్ పార్టీ నాయకులు జోల పట్టి రైతుల పొట్ట కొడుతున్నారు. గతంలో గత ప్రభుత్వ హయాంలో మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి అర్హత గల సొసైటీ ద్వారా మరియు ఎఫ్ పి ఓ, పరపతి సంఘాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు సెంటర్లను కేటాయించడం జరిగింది. కానీ నేడు అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు వారంలో సంఘం పేరు పెట్టి స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సిఫారస్ లెటర్ తో జిల్లా స్థాయి అధికారులపై ఒత్తిడి తెచ్చి కొనుగోలు సెంటర్ ల పేరుతో మోసం చేస్తున్నారు. అందుకు నిదర్శనం నిన్న జరిగిన ఐదుగురు బాలు తండా రైతుల వారి ధాన్యం సెంటర్ ఇన్చార్జిలు నాలుగు కిలోలు అదనంగా ధూపం వేసినట్టుగా బలవంతం పెట్టి సంఘం లెటర్ హెడ్ పై 44 కిలోలకు సంతకాలు పెట్టించుకున్నారు. ఈ విషయంపై తండాలోని స్థానిక రైతులు న్యాయం జరగక మమ్మల్ని సంప్రదించడం కాంగ్రెస్ పార్టీ నాయకుల మోసాలకు నిదర్శమని చెప్పారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని త్వరగా కొనుగోలను వేగవంతం చేసేటట్టు స్థానిక అధికారులు రైతులకు సహకరించాలన్నారు. ఇట్టి కొనుగోలు సెంటర్లపై జిల్లా యంత్రాంగం స్పందించి అర్హత లేని సంఘంలోని వెంటనే రద్దు చేస్తూ అర్హతగల సంఘాలకు కొనుగోలు కేంద్రం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.కె మౌలానా, పరుచూరి నరేంద్ర, రెడ్డి నాగార్జున రెడ్డి, ఆబోతు అశోక్, బుస అశోక్, బందారపు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# పలువురు బిజెపి పార్టీలో చేరికలు

**భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి**

**డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి**



**తొవ్వ, ప్రతినిధి, చెన్నారావుపేట, మే11:**
చెన్నారావుపేట మండల బిజెపి అధ్యక్షులు దామరప్పుల శేఖర్ అధ్యక్షతన జీడిగడ్డ తండా గ్రామానికి చెందిన బిజెపి నాయకులు భూక్య హరీష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు భూక్య వినోద్, భూక్య మురళి, భూక్య రాజేష్, భూక్యా నవీన్, భూక్య గణేష్, తదితరులు భారతీయ జనతా పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా రాణామాట్లాడుతూ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా చూసుకుంటామని మరియు రాబోయే స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానంలో యువతకు ప్రాధాన్యత కల్పించి మెజార్టీ స్థానాలను భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను గెలిపించి నర్సంపేట గడ్డమీద భారతీయ జనతా పార్టీ జెండా ఎగరవేస్తామని ఆయన తెలియజేశారు

# నీర్నెములలో నీటి సంరక్షణ కమిటి ఎన్నిక



**యాదాద్రి జిల్లా: రామన్నపేట: తోవ్వ ప్రతినిధి:మే 11**
రామన్న పేట మండల పరిధిలోని నీర్నముల గ్రామంలో నీటి సంరక్షణ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ సలహాదారులుగాబోయిని ఆనంద్(మాజీ సర్పంచ్)ఆవుల నరసింహ(మాజీ సర్పంచ్) నాగటి ఉపేందర్ (మాజీ వైస్ ఎంపిపి) ఆవుల సత్యనారాయణ చల్ల సత్య ప్రకాష్(మాజీ ఉప సర్పంచ్)ఆవుల క్రాంతి కుమార్(యాదవ సంఘం అధ్యక్షులు)నోముల యాదగిరి(మాజీ వార్డు సభ్యులు)ఆవుల పర్వతాలు నోముల చిరంజీవి ఎరుమండ్ల నవీన్ అధ్యక్షులు గా నోముల ప్రవీణ్ కుమార్ఉపాధ్యక్షులుచల్ల యాదయ్య మస్కు బాబు చల్లమల్ల గోవర్ధన్ ప్రధాన కార్యదర్శి ఆవుల భగవంతంసహాయ కార్య దర్శులు బోయిని మల్లేశం సుర్వి బాలరాజు నాగటి అంజయ్య కోశాధికారి బండ జగన్మోహన్ రెడ్డి కమిటీ సభ్యులుగానోముల స్వామి సుర్వీ సతీష్ నోముల శంకర్పల్లెర్ల రవీందర్ రెడ్డినోముల విష్ణు కోయగూరి బాలకృష్ణ సుర్వి మల్లేశం నోముల వంశీముత్యాల శివ ఆవుల శ్రీధర్. సుర్వి నవీన్కట్ట కుమార్ముత్యాల రమేష్ దాసరి శ్రవణ్నోముల గణేష్బతిని ఉపేందర్. ఈ కార్యక్రమంలోగ్రామ ప్రజలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యారులు

# సద్వినియోగం చేసుకోవాలి

**ఎంఈఓ గవ్వ జ్యోతి**



**యాదాద్రి జిల్లా: రామన్నపేట: తోవ్వ ప్రతినిధి: మే 11**
వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రామన్నపేట ఎంఈఓ గవ్వ జ్యోతి ఓ ప్రకటనలో తెలిపారు. మే నెల 15 వ తేది నుండి 15 రోజుల పాటు 6వ తరగతి నుండి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిబిరంలో ఇండోర్, ఔట్ డోర్ క్రీడలు అలాగే స్పోకెన్ ఇంగ్లీషు, చిత్రలేఖనం తదితర విభాగాల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ శిబిరాన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాల రామన్నపేట, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంద్రపాలనగరం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్లంకి లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా పాఠశాలల పరిసర ప్రాంత విద్యారులు ప్రధానోపాధ్యాయులను సంప్రదించి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మాజీ మావోయిస్టు నేత కునపురి రాములు వర్ధంతి



**యాదాద్రి జిల్లా: వలిగొండ: తొవ్వ ప్రతినిధి:మే 11**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని దాసిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన మాజీ మావోయిస్టు తెలంగాణ ఉద్యమ నాయకులు కునపురి రాములు 11వ వర్ధంతి ఆదివారం దాసిరెడ్డిగూడెంలో వారి స్థూపం వద్ద ఘనంగా నిర్వహించారు. భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, భువనగిరి పార్లమెంట్ ఇంచార్జి క్యామ మల్లేశం వారి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో రాములు కీలకపాత్ర పోషించాలని అన్నారు. వారి అభిమానులు కునుపురి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి, మత్స్యగిరి గుట్ట మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్ కుమార్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ సురకంటి వెంకటరెడ్డి, నాయకులు కొమురెల్లి సంజీవరెడ్డి, పడమటి మమత, బిఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 16, 17న కలెక్టరేట్ ముట్టడి జయప్రదం చేయండి

**ఎన్. పి.ఆర్.డి.జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్**




**యాదాద్రి జిల్లా :వలిగొండ: తొవ్వ ప్రతినిధి: మే 11**
వలిగొండ మండల కేంద్రంలోని సుంశాల కమాన్ చౌరస్తాలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్ పి ఆర్ డి వలిగొండ.మండల కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 16, 17 తేదీల్లో జరగబోయే జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ముట్టడి విజయవంతం చేయాలని ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్.పి.ఆర్.డి. జిల్లా కార్యదర్శి వనం ఉపేందర్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా ఉన్న వికలాంగులందరికీ అంథోదయ్యా రేషన్ కార్డ్స్ ఇచ్చి అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్లు కేటాయించి దాంట్లో కూడా వికలాంగులకు స్పెషల్ కోట లో వికలాంగులకు ఇండ్లు కూడా మంజూరు చేయాలని కోరడం జరిగింది. అదేవిధంగా 2010 నుండి పెన్షన్ పొందుతున్న ప్రతి వికలాంగులకి యూ డి ఐ డి కార్డు పంపిణీ చేయాలని స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసిన వారికి వెంటనే ఎలాంటి షరతులు లేకుండా రుణాలు ఇవ్వాలని, అదేవిధంగా ఉపాధి హామీ పథకంలో వికలాంగులతో ప్రత్యేకంగా శ్రమ శక్తి సంఘాలను ఏర్పాటు చేసే ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు జారీ చేసి 150 రోజులు పని కల్పించాలి రోజుకు 600 ఇవ్వాలని కూడా డిమాండ్ చేయడం జరిగింది. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక సమస్యలతో సతమతమవుతున్న వికలాంగులకు చేయూతనిచ్చి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కూడా ఎన్పిఆర్డి గా డిమాండ్ చేస్తున్నాము అదేవిధంగా ఈనెల 16, 17 తేదీల్లో జరగబోయే ధర్నాకు అనేకమంది వికలాంగులు వచ్చి తమ ఆవేదనని చెప్పుకోవాలను కూడా మండల వికలాంగులకు పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్ పి ఆర్ డి మండల గౌరవ అధ్యక్షులు ఏర్ర బజార్ ,వలిగొండ మండల అధ్యక్షురాలు బర్ల పార్వతి ,మండల నాయకులు ఎదురుగట్ల రవి ,ఎదురుగట్ల సలామిటి, ఎదురుగట్ల ఆనంద్ రావు ,ఎదురుగట్ల అంజమ్మ, కొమరమ్మ ,కసుల వెంకటేశం తదితరలు పాల్గొన్నారు.

# వలిగొండ మండల కమిటీ

**ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన తహసిల్దార్ ఎర్రయ్య**



**తొవ్వ,కేసముద్రం ,మే 11:**
కేసముద్రం మండల పరిధిలోని తాళ్లపూస పల్లి, కల్వల, కోరుకొండ పల్లి, మహమూద్ పట్నం, ధన్నసరి గ్రామాలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం దాన్యం కొనుగోలు కేంద్రాలను కేసముద్రం మండల తహసిల్దార్ రాగం ఎర్రయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించే విషయంపై సూచనలు తెలిపారు. లారీల కొరత ఉండడం వలన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా తరలించుటకు రైతులతో మాట్లాడి ట్రాక్టర్లు ఏర్పాటు చేసి ధాన్యాన్ని తరలించి అక్కడ కూడా అన్లోడ్ చేపించడం జరుగుతుందని కేసముద్రం మండల పరిధిలోని 10 ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇప్పటివరకు 15 లారీలు 30 ట్రాక్టర్లలో 6,254 క్వింటాల బియ్యాన్ని మిల్లులకు తరలించడం జరిగిందని మండల పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో నేటి వరకు 53,851 క్వింటాల ధాన్యాన్ని మిల్లలకు తరలించడం జరిగిందని పేర్కొన్నారు.





# అలాంటి వాడితోనే తాళి కట్టించుకుంటా!

త్రిష ప్రస్తుతం 'థగ్ లైఫ్' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా ఆమె ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో వివాహం గురించి ఆసక్తికరమైన కామెంట్స్ చేశారు. వివాహబంధంపై మీ అభిప్రాయమేంటి? అనే ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ.. 'జరుగుతున్న పరిణామాలు, చూస్తున్న నిదర్శనాలను బట్టి ప్రస్తుతానికైతే పెళ్లిపై నాకంత సదభిప్రాయం లేదు. నిజం చెప్పాలంటే మూడుముళ్ల బంధంపై నాకు నమ్మకం పోయింది. పెళ్లి చేసుకొని చాలామంది అసంతృప్తితో జీవిస్తున్నారు. కొందరైతే విడాకులు తీసుకుంటున్నారు. అలాంటి పరిస్థితి నాకు రాకూడదని కోరుకుంటున్నా' అన్నారు త్రిష. ఇంకా చెబుతూ 'పెళ్లి ఎందుకు చేసుకోలేదు? అనడిగితే నాదగ్గర సమాధానం లేదు. ఎప్పుడు చేసుకుంటారు? అనంటే నాకు తెలియదు. అసలు నాకు పెళ్లి యోగం ఉందో లేదో తెలియదు. పెళ్లి జరిగినా ఓకే.. జరక్కపోయినా ఓకే. నాకైతే బాధ లేదు. మనిషి ఆశాజీవి కాబట్టి ఒక్కటి మాత్రం చెబుతా.. పెళ్లంటూ చేసుకుంటే నచ్చినవాడ్నే చేసుకుంటా. వాడు జీవితాంతం నాకు తోడుంటాడని నమ్మితేనే తాళికట్టించుకుంటా. ఇదిమాత్రం పక్కా' అని చెప్పుకొచ్చారు త్రిష. ఈ సమాధానంతో పక్కనే ఉన్న కమల్‌హాసన్ సైతం షాకయ్యారు.

# త్రివిక్రమ్‌ను పక్కన పెడుతున్న తెలుగు హీరోలు



కొన్ని రోజుల క్రితం త్రివిక్రమ్ సినిమా అంటే హీరోలకి గ్యారంటీ హిట్ అనే నమ్మకం ఉండేది. విభిన్న కథలతో, చమత్కారమైన సంభాషణలతో ఆయన ఒక ప్రత్యేకమైన మార్క్‌ను ఏర్పరచుకున్నారు. అయితే ఇటీవల "గుంటూరు కారం" లాంటి భారీ అంచనాల సినిమా ఆశించిన విజయం సాధించకపోవడంతో, స్టార్ హీరోలు త్రివిక్రమ్ సినిమాల పట్ల కొంచెం వెనుకంజ వేస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. అల్లు అర్జున్ లాంటి స్టార్ హీరోలు కూడా ప్రాధాన్యతను అట్లీ లాంటి డైరెక్టర్లకు ఇస్తున్నారని వార్తలు రావడం, ఈ పరిణామానికి ఉదాహరణ. ఓ జమానాలో హీరోలు ఆయన డేట్స్ కోసం వెయిట్ చేస్తే, ఇప్పుడు మాత్రం ఆ ఉత్సాహం కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. తన ప్రత్యేకమైన డైరెక్షన్ స్టైల్‌కు మళ్లీ క్రేజ్ తీసుకురావాలంటే త్రివిక్రమ్ ఓ బ్లాక్‌బస్టర్ హిట్ అవసరం. ఆయన టాలెంట్‌పై ఎలాంటి సందేహం లేదు, కానీ ట్రెండ్‌కి తగినట్టు మారడం ఇప్పుడు అత్యవసరం.ఇక రాబోయే సినిమాలే ఆయన పునరాగమనానికి నాంది అవుతాయో లేదో వేచి చూడాలి!

# రాత్రంతా రచ్చే మరి నువ్వంటే పిచ్చే

డా. రాజేంద్రప్రసాద్ అర్చన ముఖ్య తారలుగా, రూపేష్, ఆకాంక్ష సింగ్ హీరో హీరోయిన్లుగా తెరకెక్కుతున్న చిత్రం 'షష్టిపూర్తి . పవన్ ప్రభ దర్శకత్వంలో మా ఆయి ప్రొడక్షన్స్ పతాకం పై రూపేష్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30 న విడుదల కానుంది. ఇప్పటి వరకు ఈ సినిమా లోని రెండు పాటలను,టీజర్ ను విడుదల చేయగా విశేష ఆదరణ లభించింది. ఇప్పుడు మూడో పాట " రాత్రంతా రచ్చే – మరి నువ్వంటే పిచ్చే , నీ మాటే నచ్చే – మది మరుమల్లై విచ్చే, చూస్తే పడతా –చేస్తే చెడతా కట కటా ..! , పద –దోస్తీ కడతా – కుస్తీ పడతా –వలపు వాకిటా ..! " ను విడుదల చేశారు. చైతన్య ప్రసాద్ రచించిన ఈ పాటను యువన్ శంకర్ రాజా , నిత్య శ్రీ ఆలపించారు. జంగ్లీ మ్యూజిక్ సంస్థ ఈ పాటను ఆన్ లైన్ లో రిలీజ్ చేసింది. యువన్ శంకర్ రాజా మాట్లాడుతూ %–% "మా నాన్న సంగీత దర్శకత్వంలో ఈ తెలుగు పాట పాడినందుకు చాలా ఆనందంగా ఉంది. ఇది చాలా కూల్ సాంగ్. మీ అందరికీ నచ్చుతుందనే అనుకుంటున్నాను. నేను కూడా ఈ 'షష్టిపూర్తి' టీమ్ లో భాగమైనందుకు ఐ యామ్ వెరీ హ్యాపీ " అని చెప్పారు. దర్శకుడు పవన్ ప్రభ , నిర్మాత – కథానాయకుడు రూపేష్ ఈ పాట గురించి వివరిస్తూ – " సరిగ్గా సినిమా ఓపెనింగ్ జరిగిన రోజునే ఈ ట్యూన్ ఇచ్చారు ఇళయరాజా గారు . ఈ సిట్యుయేషన్ కి , ఈ పాట మూడ్ కి యువన్ శంకర్ రాజా వాయిస్ అయితే పర్ఫెక్ట్ అని అనుకున్నాం. కానీ, ఇళయరాజా గారు వేరే కొత్త తమిళ సింగర్ తో ఈ పాట పాడించేశారు. తర్వాత మేం పట్టు పట్టడంతో యువన్ శంకర్ రాజాతో పాడించారు. ఇప్పటివరకు విడుదలైన రెండు పాటలు ఒకెత్తయితే, ఈ పాట ఫుల్ రొమాంటిక్ జోష్ తో ఉంటుంది. ఈ సినిమా మొత్తం మీద బాగా ఖర్చు పెట్టి తీసిన పాట ఇదే. ప్రసిద్ధ కళా దర్శకులు తోట తరణి గారు ఈ పాట కోసం నాలుగు సెట్లు వేశారు.

# సమంతా.. మళ్ళీ డీప్ లవ్..

## త్వరలో పెళ్లి బాజాలు

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకూ తన నటనతో అందరినీ ఆకట్టుకున్న సమంతా రూత్ ప్రభు ప్రేమ వ్యవహారంలో మరోసారి వార్తల్లో నిలిచింది. ఈసారి ఆమెకు జోడీగా ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు రాజ్ నిడిమోరు పేరు వినిపిస్తోంది. ఇద్దరూ గత కొంతకాలంగా డేటింగ్‌లో ఉన్నారనే వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. సమంత, రాజ్ కలిసి పికిల్ బాల్ టోర్నమెంట్‌లో కనిపించడమే కాకుండా, పలువురు సెలబ్రిటీల బర్త్ డే పార్టీలు, మ్యారేజ్ ఈవెంట్లలో కూడా కలిసి దర్శనమిచ్చారు. సమంత సినీ రంగ ప్రవేశానికి 15 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా జరిగిన అవార్డ్ ఫంక్షన్‌లో రాజ్ కూడా పాల్గొనడం గమనార్హం. వీటన్నింటి నుంచి ఈ జంట మధ్య బంధం కేవలం స్నేహానికే పరిమితం కాదని అభిమానులు అంచనా వేస్తున్నారు. తాజాగా ఈ జంట త్వరలో పెళ్లిపీటలెక్కబోతున్నారని గాసిప్ మేధావులు ప్రచారం చేస్తున్నారు. సమంత, రాజ్ నిడిమోరుతో డేటింగ్‌లో ఉన్నదీ, త్వరలోనే అతడితో వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నదీ వార్తల సారాంశం. అయితే ఇప్పటివరకు సమంతా, రాజ్ ఈ విషయంపై స్పందించలేదు. ఇదిలా ఉండగా, రాజ్ నిడిమోరు 'ది ఫ్యామిలీ మ్యాన్', 'ఫర్జీ', 'గన్స్ %ఁ% గులాబ్స్' వంటి హిట్ సిరీస్‌లను తెరకెక్కించిన దక్షిణాది దర్శకుడు. సమంతతో ఆయనకు పరిచయం 'ఫ్యామిలీ మ్యాన్ 2' సెట్‌లో మొదలై స్నేహంగా, ఆ తర్వాత ప్రేమగా మారినట్లు చర్చలు సాగుతున్నాయి.



Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146